క్లుప్తంగా

మహిళను వేధిస్తున్న ఉన్నతాధికారి

పెనమలూరు: ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న వివాహితను ఆమె పైఅధికారి వేధిస్తుండటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు.. మండలంలోని పోరంకి గ్రామంలో ఓ మహిళ తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఆమె కానూరులోని ఓ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. ఆమెతో అదే సంస్థకు చెందిన ఉన్నతాధికారి పుణ్యం గోవర్ధన్‌రెడ్డి గత కొద్ది కాలంగా అసభ్యంగా ప్రవర్తించసాగాడు. అతని వేధింపులు తాళలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ ఢీ కొన్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన కనకరాజు పెనమలూరు సెంటర్‌లోని చెప్పుల షాపులో పనిచేస్తాడు. కనకరాజు పెనమలూరు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా అతనిని గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కనకరాజును విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం



ఉయ్యూరు: శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని ఉయ్యూరు పట్టణ ఎస్ఐ జి.వాసు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ వాసు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సే రక్షణగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్, రామసత్యకిషోర్, వెంట్రప్రగడ బాబ్జీ, ఏఎస్ఐ వసంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశ భక్తిని అలవర్చుకోవాలి



గన్నవరం: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన దేశభక్తిని అలవర్చుకోవాలని ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ సబ్యసాచి సూచించారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ క్యాంప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్యసాచి మాట్లాడుతూ...ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు దేశ రక్షణ విభాగాల్లో పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. నేషనల్ ఇంటిగ్రేషన్ అంశంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు సీనియర్ అధ్యాపకులు ఇక్బాల్ అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో 318 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ నెల 28 వరకు ఈ క్యాంప్ కొనసాగుతుందని కళాశాల అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జయబాల్ తెలిపారు. కల్నల్ సంజయ్‌కుమార్, కల్నల్ సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి భరోసా



బోళ్లపాడులో సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



పోరంకిలో మందులు అందజేస్తున్న అభినేష్, సొసైటీ అధ్యక్షుడు పరమేష్

ఉంగుటూరు: ప్రజల ఆరోగ్య సమస్యలకు స్థానికంగానే స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్స అందించడంతో పాటు ఆరోగ్య భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ అన్నారు. మానికొండలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష నిర్వహిస్తోందని చెప్పారు. వైద్య శిబిరంలో అన్ని విభాగాల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 810మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎల్.ఎస్.ఆర్ కౌసల్య, వి.లావణ్య, బి.శిరీష, ప్రసన్నరాణి, మల్లిఖార్జునరావు, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ బాషా, కార్యదర్శి కిషోర్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప అసిస్టెంట్ కమిషనర్ అభినేష్ అన్నారు. పెనమలూరు ప్రభునగర్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నామని తెలిపారు. దృష్టి లోపాలు ఉన్నవారికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 19 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోరంకి సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలిచి ఉచిత వైద్య సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమాన్ని కమిషనర్ ప్రకాశరావు పర్యవేక్షించారు. వైద్యులు రవికుమార్, బిజిలి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు అంకెం రాజేష్, వీర్ల బుజ్జి, ఆకునూరు సుబ్బారావు, ముచ్చు నాగేంద్ర, నల్లమోతు జీవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, డీఎంహెచ్ఓ గీతాబాయి, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు వైద్య సేవలు పరిశీలించారు. రోగులకు సురక్ష కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ స్టాల్స్‌ను పరిశీలించి పౌష్టికాహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో సర్పంచి తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తుమ్మూరు గంగారత్నం, వైద్యులు డాక్టర్ దీప, నాగ వజ్రకుమార్, రాకేష్‌అనిల్, శివరామకృష్ణ, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి పాల్గొన్నారు.



మానికొండలో మందుల కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



తెంపల్లిలో జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీపీ రవి

అందరికీ నాణ్యమైన వైద్యం

గన్నవరం రూరల్: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత ప్రభుత్వ వైద్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. తెంపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొలుసు శిరీషా, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, మండల కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఎంపీడీఓ సత్యకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వంశీ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

గన్నవరం: స్థానిక శాసన సభ్యుని కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను వంశీమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న 2,700 మంది గ్రామ వలంటీర్లకు ఎమ్మెల్యే ఉచితంగా స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా పలువురికి ట్రై సైకిల్స్, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, పలు శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ జన్మదిన వేడుకలు హనుమాన్ జంక్షన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావులు కేక్‌ను కట్ చేశారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే వంశీ పేరిట స్వామివారికి తమలపాకు అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచి సరిపల్లి కమలాభాయి, పీఏసీఎస్ చైర్మన్‌లు దయాల విజయనాయుడు, మూల్పూరు ప్రభుకాంత్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రామాంజనేయులు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, ఎం.యోహన్‌కుమార్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, పార్టీ నేతలు కురుమిని శ్రీనివాసరావు, అల్లంశెట్టి శ్రీనివాసరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నున్నలో...

నున్న(విజయవాడరూరల్): ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జన్మదినోత్సవాన్ని నున్న గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రత్తిపాటి రవీంద్ర, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రరెడ్డి, పార్టీ నేతలు శ్రీనివాసరావు, శివరామిరెడ్డి, హనుమా, కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ



నున్న గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అంబాపురం గ్రామంలో...

అంబాపురం గ్రామంలో గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోడేటి రూబేన్, పార్టీ నేతలు తోడేటి బెంజిమెన్, జోగా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్దవరంలో జన్మదిన వేడుకలు

మండలంలోని బుద్దవరం గ్రామంలో ఉపసర్పంచి వేల్పూరి బసవరావు నేతృత్వంలో ఎమ్మెల్యే వంశీమోహన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జన్మదిన కేక్‌ను కట్ చేయడంతో పాటు గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

లలితాదేవీ... నమోస్తుతే...



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శ్రీలలితా హోమంలో పాల్గొన్న భక్తులు



ఉయ్యూరు శ్రీవిజయ దుర్గాభవాని ఆలయంలో లలిత త్రిపురసుందరి దేవిగా అమ్మవారు

నున్న(విజయవాడరూరల్): శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు శనివారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నున్న గ్రామం చెరువు సెంటర్లో శ్రీదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారికి దుర్గాదేవిగా అలంకారం చేసి విశేష పూజ, ఉక్త హోమాలు, దుర్గాదేవి మూలమంత్ర హోమము, నివేదన, హారతి పూజలు నిర్వహించారు. శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవిగా పూజలందుకున్నారు. శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణలో భక్తులు పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ జరిగింది. విలేజి కండ్రికలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీలలితా హోమం, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలలితా త్రిపురసుందరీదేవికి పలువురు దంపతుల ఆధ్వర్యంలో తామర పూలతో పూజ చేశారు. దావాజిగూడెం, అల్లాపురం, బుద్దవరం, కేసరపల్లి గ్రామాల్లో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ఉయ్యూరులో...

ఉయ్యూరు: దేవీ శరన్నవరాత్రులు ఉయ్యూరులో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శనివారం లలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఉయ్యూరు ఏజీకె నగర్‌లోని శ్రీవిజయ దుర్గాభవాని దేవి ఆలయంలో లలితాత్రిపుర సుందరీ దేవిగా, శివాలయంలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కంకిపాడులో....

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. కంకిపాడు శివాలయం, ఈడుపుగల్లు శివాలయంలో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగానూ, ప్రొద్దుటూరు శివాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాత గజలక్ష్మిదేవిగా పూజలందుకున్నారు. మద్దూరు కూడలిలో ఏర్పాటు చేసిన పూజా మందిరంలో భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.



కంకిపాడులో గజలక్ష్మిగా వాసవీమాత



మద్దూరులో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న

పెనమలూరు: రాష్ట్రంలో పేద ప్రజలకు జగనన్న అండగా నిలిచి ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప కాలువ కట్టపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నామని వివరించారు. కాలువ కట్టలపై ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని పేర్కొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మకండి

రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ఒక వర్గం మీడియా జగనన్న పాలనపై అసత్య ప్రచారం చేస్తున్నాయని వారి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పేదలు బాగుపడుతున్నా, పేద పిల్లలు చదువుకుంటున్నా ప్రతి పక్షాలు ఓర్వలేకపోతున్నారని తెలిపారు. ఓటు ద్వారా ప్రతిపక్షాలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, తాడిగడప పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు పోలవరపు బాబీ, జయకిషోర్, జిన్నా, ముజీబ్, శ్రీకాంత్‌రెడ్డి, అర్షద్, వెలిశిల ప్రసాద్, నర్రా చంటి, శ్రీను, ఖాదర్‌బాషా, ఈదా రాజేష్, చాంద్‌బాషా, సిద్దిఖ్, వేమూరి బాలకృష్ణ, పి.వెంకన్న, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాడిగడప కట్టపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి